

# రాగి చెంబులో చేపపిల్ల

సుబ్బమ్మగారు పండు ముత్తయిదువు. డెబ్బై ఏళ్ళు దాటుతున్నా కాయబారు మనిషి. నడుం వంగలేదు, చూపు తగ్గలేదు. నిప్పుల మీద నీళ్ళు చల్లేటంత ఆచారం. నిప్పుతో నీళ్ళని శుద్ధిచేసేటంత వీరమడి. ఈ ముక్క మాటవరస కనడంలేదు. సుబ్బమ్మ గారింట్లో నీళ్ళగాబు చూస్తే అక్కడ బొగ్గులు తేల్తూ కన్పిస్తాయి. వొడ్డిర వాళ్ళు కృష్ణనుంచి తీసుకొచ్చి పోసిన నీళ్ళు కనుక మండుతున్న కట్టెపేడు ఒకటి తీసుకెళ్ళి ఆ గాబులో ముంచుతుంది. అప్పుడు ఆ నీళ్ళు శుద్ధి అయినట్టు.

అలా శుద్ధి అయిన నీళ్ళతో కల్లాపు జల్లి, ముగ్గువేసి ఆపైన వంటిల్లు అలుక్కుని పొయ్యి అలికి అక్కడ మళ్ళీ ముగ్గువేసి కృష్ణకి స్నానానికి బయల్దేరేప్పటికి తొమ్మిదవుతుంది. కావిళ్ళతో నీళ్ళు తెచ్చేవాళ్ళకి దూరంగా నడుస్తూ దోవలో

కావమ్మగారింట్లో కరివేపాకడిగి రామయ్యగారి దొడ్డి దగ్గర కొచ్చేసరికి రామయ్యగారి కర్రి ఆవు సుబ్బమ్మగార్ని చూసి బుసలు కొడ్తుంది. సుబ్బమ్మగారికి ఆ ఆవంటే గొప్ప భక్తి. అదేం ఖర్మమో! ఆ ఆవు ఈవిణ్ణి చూడ్డం ఆలస్యం కొమ్ములు విసుర్తూ పలుపు తెంపుకోబోతుంది. సుబ్బమ్మగారు చిన్న బుచ్చుకున్న ముఖంతో, బతిమిలాడ్తూ "మా అమ్మకదూ ! మా తల్లికదూ! మా పార్వతీదేవికదూ! అమ్మా! అమ్మా!" అంటూ ప్రార్థిస్తుంది. ఊహుఁ! ఆ ఆవు వినదు. రుసరుసలాడ్తూ కదం తొక్కుతుంది. ఇక లాభంలేదని రామయ్యగారి పాలేర్ని పిలిచి పలుపు పట్టుకోమని సుబ్బమ్మగారు ఆవు వెనక్కు వెళ్ళి ఆవు పంచితం తలమీద చల్లుకుని దణ్ణం పెట్టుకుని కృష్ణ రేవులో కొచ్చేసరికి పదిగంటలవుతుంది. బట్టలుతుక్కుని స్నానానికి నీళ్ళలోకి దిగేసరికి మరోగంట. సుబ్బమ్మగారి స్నానమయ్యేసరికి సూర్యుడస్తమిస్తాడని వాడుక. ఆవిడ స్నానం చూడవలసిందే! ఎన్ని వందలసార్లు నీళ్ళలో మునుగుతుందో చెప్పలేము. ఒక్కొక్క దేవుడి పేరున ఒక్కో మునక. దిక్కు దిక్కుకూ తిరిగి వందనాలు, ప్రదక్షిణాలు. పేరుపేరునా అర్ఘ్యాలు. అలా మునిగి మునిగి ఉతికిన బట్టలు భుజాన వేసుకొని బిందెతో నీళ్ళు ముంచుకుని వొడ్డుకి పదగుడులు వేసేదో లేదో ఆ బిందెడు నీళ్ళు పారబోసేది. కారణం ఏవీలేదు. ఏ ఉప్పర సరవయ్యో ఎదురుగా వచ్చేవాడు అంతే. మళ్ళీ కృష్ణలో మునిగి నీళ్ళు ముంచుకు పైకొచ్చి, అన్నం మెతుకు కాలి కిందపడిందని మళ్ళీ నీళ్ళు పారబోసేది. మళ్ళీ మునక. మళ్ళీ నీళ్ళ బిందె. వస్తుంటే చింతచెట్టు మీంచి కొంగరెట్ట వేసిందేమో అన్న అనుమానం కొద్దీ మళ్ళీ నీళ్ళు పారబోసేది. ఇలా పారబోసిన నీళ్ళతో రేవు రేవంతా బురదయ్యేది. అనేక గండాలు తప్పించుకుంటూ మంచి నీళ్ళ బిందె ఇంటికి చేరటానికి గంటపైగా పట్టేది.

పన్నెండు గంటలు దాటుతున్నవేళ పొయ్యి రాజేసేది. నడుస్తున్నా నేలంతా మడినీళ్ళు చల్లుకుంటూ వండుతున్న ప్రతి వస్తువు మీద మడి నీళ్ళు చిలకరిస్తూ వంట సాగించేది. సుబ్బమ్మ గారి భర్త సత్యనారాయణగారు పిల్లలకి పాఠాలు చెప్పి చెప్పి ఆకలి లోపల ఉరకలు వేస్తుంటే నీరసంగా స్తంభానికి ఆనుకుని కూర్చునేవాడు. ఎంతసేపటికీ వంటింట్లోంచి పిలుపు రాదు. కాసేపు వంటింటి

వైపు. కాసేపు చూర్లో పిచ్చికల వైపు చూస్తూ నిముషాలు లెక్కపెట్టుండేవాడు.

ఒంటిగంట ఒంటిగంటన్నరకు వంటవగా, అప్పుడు దొడ్లో తులసికోట దగ్గర పూజ ప్రారంభించేది సుబ్బమ్మగారు. తులసెమ్మకు నీళ్ళుపోసి ప్రదక్షిణాలు చేసి స్తంభాని కంటుకుపోయిన భర్తనుద్దేశించి "స్నానానికి లేవండి" అనేది. సత్యనారాయణగారు ఆ పిలుపందుకుని చెంగున లేచి గాబులో నీళ్ళు నాలుగు చెంబులు నెత్తిన గుమ్మరించుకుని ధావళీ కట్టుకుని పీటమీద వాలేవాడు. ఆయన భోజనం అయ్యేక తను వడ్డించుకుని తిని ఎంగిళ్ళెత్తి సుబ్బమ్మగారు మైలపడేసరికి మూడు దాటేది.

అలా ఒకరోజున భోజనం ముగించుకొని వరండాలో పీట తలకిందపెట్టుకుని సుబ్బమ్మగారు చెంగు వాల్చుకు పడుకుంటే ఆవిడకి ఉన్నట్టుండి దాహమేసింది. మొదట్లో లేవడానికి బద్ధకించి అలాగే పడుకుంది. ఆ రోజున పండు మిరపకాయల కారంలో నెయ్యి ఎక్కువేసుకుందేమో దాహం ఆగలేదు. లేచి వంటింట్లోకెళ్ళి రాగి చెంబుతో నీళ్ళు ముంచుకొని సగం తాగి చెంబులోకి చూస్తే-ఇంకేముంది? కొంప మునిగింది 'శివాశివా!' అంటూ చెంబు వొదిలేసి తనూ పడిపోయింది. ఆ మోతకి నిద్రపోతున్న సత్యనారాయణగారు ఉలిక్కిపడి లేచి పరుగెత్తుకొచ్చారు.

చూస్తే- ఆ రాగిచెంబు నీళ్ళలో అడుగున చేపపిల్ల!

తలుపానుకుని చెంగు కళ్ళకడ్డం పెట్టుకుని కుమిలిపోతోంది సుబ్బమ్మగారు. " ఆ నీళ్ళతోనే అన్నం వండింది. ఆ నీళ్ళతోనే పప్పుచేసింది. ఆ నీళ్లతోనే పచ్చడి నూరింది. ఆ నీళ్ళతోటే దేవుడికి నైవేద్యం పెట్టింది. అవే తాగింది. అట్లా తన మడి మండిపోయింది ..... " కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది సుబ్బమ్మగారు. అలా ఏడుస్తున్న సుబ్బమ్మగార్ని చూసి సత్యనారాయణ గారన్నారు. "పిచ్చిదానా! నువ్వు స్నానంచేసే కృష్ణలో చేపలు లేవా? వొడ్డిర సవరాయి మైలా? నువ్వు తినే అన్నం కాలికి తగిల్తే మైలా? నీలోపల మైల లేదా?" సుబ్బమ్మగారు కళ్ళెత్తి చూసింది. ఎవర్నీ అంటకుండా మడిగా ముత్యపు చిప్పలో ముత్యంలా బతకాలనుకుంది. నీళ్ళలో చేపలా బతకాలని తెలిసింది కాదు. అందుకేనేమో రామయ్యగారి కర్రి ఆవు తనని చూస్తే పొడవటానికి వస్తుంది.*